WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం
తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 321 గురువారం 2-4-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

5లక్షలు ఇచ్చామని చెప్పి, 15లక్షలు తొలగించే కుట్ర
ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత



హైదరాబాద్,ఏప్రిల్1నవతరం రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు.

మిగతా 2లో



## అమరావతికి చట్టబద్దత ఐదుకోట్ల ఆంధ్రుల విజయం

చంద్రబాబు దూరదృష్టి వల్లనే సాకారం
విషం చిమ్ముతున్న వారికి ప్రజలే గుణపాఠం చెబుతారు
అమరావతికి సహకరించిన మోడీ, అమిత్ షాలకు ధన్యవాదాలు
ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్ ట్వీట్

అమరావతి,ఏప్రిల్1 నవతరం: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ బిల్లుకు మద్దతు

మిగతా 2లో

## నేటి నుంచి భూభారతి అమలు



2లో

- భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం
- ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



- కేరళలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం
- మోహన్‌లాల్ పంచ్ డైలాగ్‌తో సీఎం పినరయి విజయన్‌కు సెటైర్
- ఎల్డీఎఫ్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే..
- నరేంద్ర మోదీ, విజయన్‌లను ఓడిస్తేనే మంచి రోజులని వ్యాఖ్య
- హస్తానికి ఓటేస్తే పాత కేరళను చూపిస్తామని రేవంత్‌రెడ్డి హామీ
- ఎర్నాకుళం రోడ్ షోలో పొంగులేటి

## కేరళ ఎన్నికల ప్రచారంలో
# సీఎం రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 1నవతరం
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ హోదాలో కేరళ వెళ్లిన రేవంత్ రెడ్డి... 'నీ పో మోనే విజయా..!' (విజయన్ నువ్వు దిగిపో) అంటూ ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ పంచ్ డైలాగ్‌ను సీఎం పినరయి విజయన్‌కు అన్వయించి పలికి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. కేరళలోని నేమం సహా పలు నియోజకవర్గాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన రేవంత్ రెడ్డి.. ఎల్డీఎఫ్‌కు ఓటు వ్యస్త బీజేపీకి వేసినట్లేనని పేర్కొన్నారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని మోదీ.. తిరువనంతపురం కమ్యూనిస్టు పినరయి విజయన్‌ను ఓడిస్తేనే కేరళకు మంచిరోజులు వస్తాయన్నారు. కేరళలో ఎల్డీఎఫ్, బీజేపీ మధ్య ఒప్పందాలు ఉన్నాయని, మోదీ, విజయన్‌లవి భిన్న భావజాలాలైనా భావాలు మాత్రం ఒక్కటేనని వ్యాఖ్యానించారు. నేమం నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరీనాథన్ తరఫున పూంథురలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ను కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గిసింది యూడీఎఫ్ అన్నారు. కేరళలో జాతీయ రహదారులు సహా పలు అభివృద్ధి

మిగతా 2లో

## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- ఇక శాశ్వత రాజధానిగా అమరావతి
- ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం
- టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి



2లో

## దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు

- యూడీఎఫ్‌ను నమ్మదగని, నిజాయతీలేని, మోసపూరితమైనది
- రెండు కూటములను సాగనంపండి
- కేరళ ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పిలుపు



2లో

## మంత్రి పొంగులేటి అక్రమాలపై
# హౌజ్ కమిటీ కోరాం



మిగతా 2లో

- సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు
- కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం
- ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్1 **నవతరం** రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్



హైదరాబాద్,ఏప్రిల్1నవతరం
ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఏపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష

మిగతా 2లో

# కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్

(మొదటి పేజి (తరువాయి)

పనులు నిలిచిపోయినా సీఎం పినరయి విజయన్ ఎందుకు నోరు మెదపట్లేదని ప్రశ్నించారు.

కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, సీపీఎంల మధ్య రహస్య అవగాహన ఉందని, అందుకే సీపీఎం వాళ్లపై ఎటువంటి కేసులూ ఉండవని ఆరోపించారు. దేశంలోని ప్రతిపక్ష నేతలను ఈడీ, సీబీఐలతో వేధించే బీజేపీ ప్రభుత్వం.. విజయన్ సర్కారుపై మాత్రం ఈగ వాలనీయట్లేదన్నారు. బీజేపీ, ఎల్‌డీఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్టు కనిపించినా, అది ఉత్తుత్తి పోటీనేనన్నారు. కేరళ సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు. విద్యావంతులైన ఎందరో మలయాళీలు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని.. వారికి స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు లేవని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేరళ సమగ్రాభివృద్ధికి యూడీఎఫ్ ప్రణాళికలు రచిస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. హస్తం పార్టీకి ఓటేస్తే పాత కేరళం ఏమిటో మళ్లీ చూపిస్తామని హామీ ఇచ్చారు. డెవల్‌పమెంట్ విత్ డిగ్నిటీతో ముందుకు వెళుతున్నామని సీఎం తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ సీఎంలవి నిష్కళంక రాజకీయాలు...**

సామాజిక ప్రగతి, అభివృద్ధి, అక్షరాస్యతలో కేరళ ఎప్పటినుంచో దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందంటే.. అందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన కృషే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్య, అవగాహన, సామాజిక చైతన్యంలో కేరళం దేశానికి అప్పటికీ, ఇప్పటికీ నమూనాగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు కరుణాకరన్, ఊమెన్ చాందీ, ఏకే ఆంటోనీల కృషి ప్రధాన కారణమని కొనియాడారు. కరుణాకరన్ కేరళలో అభివృద్ధికి బాటలు వేశారని, ఊమెన్ చాందీ సంక్షేమం-అభివృద్ధి రెండింటికీ సమప్రాధాన్యం ఇచ్చారని, ఏకే ఆంటోనీ నిజాయతీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనలో కేరళంకు గౌరవం, నమ్మకం, పరిపాలనా స్థిరత్వం వచ్చిందన్నారు. ఇక, 12ఏళ్లుగా ఢిల్లీలో, పదేళ్లుగా కేరళంలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోదీ, కేరళంలో విజయన్ 'డబుల్ ఫెయిల్యూర్'గా నిలిచారని విమర్శించారు. మోదీ, విజయన్ సిద్ధాంతాలు వేరైనా వైఫల్యాలు ఒకేలా ఉన్నాయన్నారు. సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళం కూడా అలానే ముందుకు వెళ్లాలని తన ఆకాంక్ష అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేరళం అభివృద్ధికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని అన్నారు.

**ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు బిజీబిజీ**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు.. ప్రస్తుతం కేరళ, పుదుచ్చేరి ఎన్నికల ప్రచారంలో బిజీబిజీ అయ్యారు. స్టార్ క్యాంపెయినర్‌గా కేరళ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. తిరువనంతపురం, అలప్పుజ, ఎర్నాకుళంలలో బుధవారం జరిగిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి మట్టతార వరకు జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న సీఎం రేవంత్.. భారతన్నూర్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్ధత ఐదుకోట్ల ఆంధ్రుల విజయం

తెలిపిన పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ ట్వీట్ చేశారు. అమరావతికి చట్టబద్ధత లభించడాన్ని జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్న వారికి రాబోయే రోజుల్లో ప్రజలు బలమైన గుణపాఠం నేర్పిస్తారని మండిపడ్డారు. రాజధాని అమరావతికి తోడ్పాటును అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన అపార అనుభవంతో.. అమరావతి ప్రజారాజధానిగా, భావితరాల అభివృద్ధికి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'లోక్ సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన ఈ చారిత్రక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది పౌరులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా.

ఈరోజు ఆంధప్రదేశ్ చరిత్రలో ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. అమరావతిని ఏపీ ఏకైక, శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ అమరావతి బిల్లు ఆమోదం పొందడం ప్రజా సంకల్పం, స్థైర్యం, ఆశయాలకు ప్రతిబింబంగా నిలుస్తోంది. రాజధానికి 33,000 ఎకరాలకు పైగా భూమిని అప్పగించి సాటిలేని త్యాగం చేసిన అమరావతి ప్రాంత రైతాంగానికి నా ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి చేసిన త్యాగం తరతరాలపాటు గుర్తుండిపోతుందని అన్నారు. అమరావతి నిర్మాణానికి పునాది వేసి అచంచలమైన నిబద్ధత కలిగిన సీఎం చంద్రబాబు దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఈ కలను సాకారం చేయడంలో నిరంతర మద్దతు అందించిన ప్రధాని మోదీ, ఎన్డీయే ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గత ప్రభుత్వపు తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల తలెత్తిన సవాళ్ల సమయంలో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ ఆశయాలకు అనుగుణంగా స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రగతి, స్థిరత్వానికి అనుగుణమైన భవిష్యత్తును ఎంచుకున్నారు. పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించడంతో ఆంధప్రదేశ్ ప్రజల్లోనే కాకుండా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లో బలమైన నూతన విశ్వాసం చిగురించింది. 'స్వర్ణ ఆంధ్ర-2047' కలను సాకారం చేయడంలో అమరావతి కీలకపాత్ర పోషిస్తుందని, అలాగే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్- 2047' లక్ష్యానికి గణనీయమైన తోడ్పాటును అందిస్తుందని దృఢంగా విశ్వసిస్తున్నా' అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది.
తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ
విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

## దోచుకోవడానికే అమరావతి ప్లాన్



అమరావతి,ఏప్రిల్1 చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. అబద్దాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్న మని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారధి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

## మృత్యువులా దూసుకొచ్చిన కారు

**నేడు వివాహ నిశ్చితార్థం...అంతలోనే రోడ్డు ప్రమాదం**
**ప్రమాదంలో యువకుడు మృతి**




ఖమ్మం,ఏప్రిల్1( జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

## మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం



మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

## దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు

తిరువనంతపురం,ఏప్రిల్1 కేరళంలోని కష్టజీవులు, నిజాయతీపరులైన ప్రజలను దశాబ్దాలుగా లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, యునైటెడ్ డెమొక్రటక్ ఫ్రంట్‌లు వంచిస్తున్నాయని, రెండు కూటమిల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడం కాకుండా రెండింటినీ ఇంటికి సాగనంపాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరవూర్ నియోజకవర్గంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ జెండాలు, గుర్తులు వేరైనప్పటికీ వాటి ప్రవర్తన, క్యారెక్టర్ ఒకటేనని చెప్పారు. ఆలోచనా ధోరణి కూడా ఒకటేనన్నారు. సమాజాన్ని విడగొట్టడం, కేరళం ఆర్థిక వ్యవస్థను పతనం చేయడం కోసం పనిచేస్తుంటాయని విమర్శించారు. ఎల్డీఎఫ్ అంటే లూటీలు, విభజనలు, వైఫల్యం(లూట్, డివిజన్, ఫెయిల్యూర్) అని రాజ్‌నాథ్ నిర్వచించారు.

## చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం

**ఉచిత విద్యుత్‌తో తీరనున్న కష్టాలు**
**ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్ట్**



అమరావతి,ఏప్రిల్1 ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా చిన్న చేనేత కుటుంబాలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని నిపుణులు చెబుతున్నారు. . 2017లో నేతన్నలు తమ సమస్యలు వివరించినప్పుడు తనకు తీవ్రంగా బాధ కలిగిందని తెలిపారు.

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## నేటి నుంచి భూభారతి అమలు





హైదరాబాద్,ఏప్రిల్1 తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభా రతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

# ఘనంగా ఎస్.కే. ఆబిద్ జన్మదిన వేడుకలు

**● స్వగ్రామం అయినటువంటి తోర్నాలలో అంబురాన్నంటిన సంబురాలు**
**● గృహప్రవేశ కార్యక్రమంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన గ్రామప్రజలు**

కుత్బుల్లాపూర్ / నారాయణఖేడ్, నవతరం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువనాయకుడు, మంజూర్ నగర్ ఫౌండర్ ఎస్. కే. ఆబిద్ జన్మదిన వేడుకలు తన సొంత గ్రామమైనటువంటి మెదక్ జిల్లా తోర్నాల్ లో ఘనంగా జరిగాయి. అదే రోజు తన స్వగ్రామంలో నూతన గృహప్రవేశం చేసినందున అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నుండి సైతం తరలివెల్లిన తన అభిమానులు, మిత్రులు, పలు సంఘాల నాయకులు ఎస్.కే. ఆబిద్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, షాలువాలతో సన్మానం చేశారు.














# భద్రతా ఉల్లంఘనలపై తక్షణ చర్యలు తీసుకోండి










హైదరాబాద్, నవతరం: తెలంగాణ ఎన్ఎస్యుఐ తరపున గొల్ల జాన్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కుందన్ యాదవ్‌తో కలిసి అకాడమిక్ జాయింట్ సెక్రటరీ కె. వసుంధరాదేవి కి వినతిపత్రం సమర్పిం చారు. ఇంటర్మీడియట్ బోర్డు నియమాలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్న బసిష్ట కాలేజీపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఐడీపీఎల్, కుత్బుల్లాపూర్‌లో ఉన్న భాషిత కాలేజీలో జరుగుతున్న అక్రమ మరియు అసురక్షిత కార్యకలాపాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంస్థ 5వ అంతస్తులో ఫైర్ ఎన్వోసీ లేకుండా, అగ్నిమాపక భద్రతా నిబంధనలు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ నిర్లక్ష్య చర్యలు విద్యార్థుల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి. పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, కాలేజీ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యంగా మరియు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. అదేవిధంగా, అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశీలించకుండా అదే సంస్థకు పరీక్షా కేంద్రం కేటాయించడం ఆందోళనకర విషయం. ఇది సంబంధిత అధికారుల పర్యవేక్షణపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతోంది.

**ఎన్ఎస్యుఐ తరపున డిమాండ్లు:**

- సంస్థపై తక్షణ సమగ్ర తనిఖీ నిర్వహించాలి
- కాలేజీకి కేటాయించిన పరీక్షా కేంద్రాన్ని వెంటనే రద్దు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- నిర్లక్ష్యం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి

తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఈ విషయాన్ని హైకోర్టు, విజిలెన్స్ సంస్థల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నాము. విద్యార్థుల భద్రత, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# నా వాళ్లు వస్తారని ఎదురు చూస్తున్నా,

**- అశ్వారావుపేట' అమ్మ సేవా సదన్' వృద్ధాశ్రమంలో ఓ పండు టాకు దీనగాధ**

నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా
నా వాళ్లు వస్తారని దీనంగా ఎదురుచూస్తున్నాను. నన్ను వదిలేసి వెళ్లిపోయారు. నేను ఎలా బతికానో మీ అందరికీ తెలియనిది కాదుగా నాన్న,, ఈ దశలో ఉన్న నన్ను వృద్ధాశ్రమంలో వదిలేస్తే నా బ్రతుకు ఏం కావాలి.మా వాళ్లకు ఫోన్ చేద్దామంటే నా దగ్గర ఫోను లేదు,నెంబర్ లేదు. ఇది న్యాయమేనా? సంక్రాంతి పండుగకు వెళ్లిన తర్వాత ఆశ్రమం రోడ్డు అవతల నిలబడి ఓ పాత చీరను నా మోహన పడేసేందుకు తీసుకువచ్చారు. ఇది ఏం పద్ధతి అంటూ కవరేజ్ కి వెళ్ళిన సీనియర్ రిపోర్టర్కి, మరికొందరితో చెబుతూ చిట్టెమ్మ (91 సంవత్సరాలు) అనే వృద్ధురాలు కంటతడి పెట్టిన తీరు మనుషుల మనసును కదిలించి వేసింది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న ఒక్కొక్కరిది ఒక్కొక్క దీనగాధ. ఒకసారి ఆలోచించండి మనల్ని "నవ మాసాలు" మోసి కని పెంచిన తల్లిదండ్రులను విస్మరించవద్దు.వారు కంటతడి పెడితే మనకి శుభం కలగదు. మీరు వచ్చి తీసుకువెళ్తారని గుమ్మం దగ్గర కూర్చొని ఎన్ని రోజులని ఆ పండు టాకు ఎదురుచూస్తుంది మీరే ఆలోచించండి. ఆ పండు టాకు



పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలారా,,
ఈ వార్త ద్వారా ఆమె బాధను అర్థం చేసుకొని ఇప్పటికైనా కన్నప్రేగు రుణం తీర్చుకోండి.

# ఇంటింటికి సిపిఐ, ప్రజా సమస్యల పై నిత్యం పోరాటం

**సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్**



కుత్బుల్లాపూర్, నవతరం: భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఏప్రిల్ 1నుండి 10వ తేదీ వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాచుపల్లి మండలం నిజాంపేట్, ప్రగతి నగర్లో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పై అలుపెరుగని పోరాటం చేసేది కేవలం భారత కమ్యూనిస్ట్ పార్టీ మాత్రమే అని గుర్తు చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 1925 డిసెంబర్ 26వ తేదీన కన్పూర్లో ఆవిర్భవించింది. అలాగే సంపూర్ణ స్వాతంత్రం కోసం తీర్మానం చేసిన మొదటి రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్ట్ పార్టీ అని గుర్తు చేశారు. కేరళ, పశ్చిమ బెంగాల్, శ్రీకాకుళం భూపోరాటాలు, తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం లాంటి అనేక పోరాటాలు నిర్వహించి అనేక మంది ప్రాణాలు త్యాగం చేసింది భారత కమ్యూనిస్ట్ పార్టీ అని అన్నారు. గతంలో అయినా ఇప్పుడు అయినా భూమి ఆకాశం వున్నన్ని రోజు సిపిఐ పార్టీ ఉంటుంది పేద ప్రజా సమస్యల పై పోరాటం చేస్తుంది అని అన్నారు. బాచుపల్లి మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించము అని ప్రజా సమస్యల పై దీక్షలు చేశాము అని గుర్తు చేశారు. ముఖ్యంగా దోమల నివారణ ముఖ్యమైన సమస్యగా మారింది అని, నిత్యావసరల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, సిఎంసీ, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజ్ పెండింగ్లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే దేశ వ్యాప్తంగా కార్మిక కొడ్లు రద్దు చేయాలనీ కార్మిక సంఘాల నిరసన చేస్తున్నాయి అని కనుక కార్మిక వెతిరేక కొడ్లను ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింహా, కృష్ణ, దుర్గయ్య, శ్రీను, శంకర్, మహేష్, మల్లేష్, వాసు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో ప్రగతి వేగం

**● అశ్వారావుపేటలో 'పరిశుభ్ర' విప్లవం**
**● 99 రోజుల ప్రణాళికతో మారిన వార్డుల రూపురేఖలు**
**● ఏ ఎస్ ఆర్ నగర్‌లో ముమ్మరంగా డ్రైనేజీ ప్రక్షాళన పనులు**
**● అంటువ్యాధులపై యుద్ధం**
**● వర్షాకాలానికి ముందే మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తం**
**● ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ అశ్వారావుపేట సాధ్యం**
**● కౌన్సిలర్ మిండా హరిబాబు**



నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి జిల్లా
ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అశ్వారావుపేట పురపాలక సంఘంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తూ 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన పనులు స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నాయి.


ముందస్తు జాగ్రత్తలతో అంటువ్యాధులకు చెక్.
సాధారణంగా వర్షాలు పడ్డాక డ్రైనేజీల గురించి ఆలోచించే పద్ధతికి స్వస్తి పలికి, ముందుచూపుతో పనులు చేపట్టడం ఇక్కడి విశేషం. డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ (మురుగు)ను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేస్తున్నారు.

జన చైతన్యమే లక్ష్యంగా...
కేవలం పనులు చేయడమే కాకుండా, ప్రజల్లో అవగాహన కల్పించడంపై కౌన్సిలర్ నిండా హరిబాబు ప్రత్యేక దృష్టి సారించారు. "తడి చెత్త - పొడి చెత్త" వర్గీకరణ గురించి వివరిస్తూ, ప్రతి ఇల్లూ ఒక పరిశుభ్ర నిలయంగా మారాలని పిలుపునిచ్చారు.

ప్రజా ప్రతినిధుల చొరవ:
ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు దోరెపల్లి కరుణ, దయాకర్, వీరన్న, మస్తాన్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బందికి తోడుగా స్థానికులు కూడా శ్రమదానం చేయడం విశేషం. సాధారణంగా వర్షాకాలం మొదలైన తర్వాత మేల్కొనే ధోరణికి భిన్నంగా ఈసారి ముందస్తు చర్యలపై అధికారులు దృష్టి సారించారు. కౌన్సిలర్ మిండా హరిబాబు ఆధ్వర్యంలో డ్రైనేజీలలో పేరుకుపోయిన మురుగును చెత్తను తొలగించడం ద్వారా అంటూ వ్యాధులు ప్రబలే అవకాశాలను ఆదిలోనే తుంచి వేస్తున్నారు. ముఖ్యంగా నీటి నిలువలు లేకుండా చేయడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టే దిశగా ఈ కార్యక్రమం సాగింది. ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం. పరిశుభ్రత అనేది కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యతే కాదని అది ప్రతి పౌరుడి కర్తవ్యం అని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. మునిసిపల్ సిబ్బందితో కలిసి స్థానిక ప్రజలు కూడా ఈ శ్రమదానంలో పాల్గొనడం విశేషం. శుభ్రత ఆరోగ్యానికి మూలం అనే నినాదంతో కౌన్సిలర్ ప్రజలను చైతన్య పరచడం సానుకూల మార్పునకు సంకేతం.కేవలం శుభ్రం చేయడం మాత్రమే సరిపోదని తిరిగి డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ఉండాలని కోరారు. వార్డు కౌన్సిలర్ మొదలుకొని పారిశుద్ధ్య కార్మికుల వరకు అందరూ సమన్వయంతో పని చేస్తుండడంతో వైఎస్సార్ నగర్ ఇప్పుడు సరికొత్త రూపును సంతరించుకుంది. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అప్పుడే అశ్వారావుపేట ఒక ఆదర్శ పురపాలక సంఘంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నిర్మాణ కార్మికుల భద్రతే లక్ష్యం









సైబరాబాద్, నవతరం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, భద్రత, భీమాపై అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కొల్లూరు, నార్సింగి, గచ్చిబౌలి ప్రాంతాలకు చెందిన నిర్మాణ కార్మికుల ప్రతినిధి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేబర్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్, ప్రావిడెంట్ ఫండ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, కార్మికుల చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ పథకాలు, ఇన్సూరెన్స్ ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రాణహానిని అరికట్టవచ్చని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ... మహిళలు, చిన్నారుల విషయంలో లేదా ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తింపులో ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. లేబర్ క్యాంపుల్లో స్పష్టమైన నిబంధనలు, భద్రత చర్యలు కచ్చితంగా అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు కార్మికులకు అందేలా సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై లేబర్ క్యాంపుల్లో తరచూ తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు లేదా కేసులు జరిగినప్పుడు బాధితులతో సానుభూతితో వ్యవహరించాలని, దూర ప్రాంతాల నుండి వచ్చిన కార్మికులకు కనీస వసతి సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రమాద బీమా, ఆరోగ్య పరీక్షా శిబిరాలు నిర్వహించి వారి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చట్ట నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, భద్రత, చట్టపరమైన నిబంధనల అమలుపై పలు కీలక సూచనలు చేశారు. కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించడం, ఆరోగ్య, భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించడం అత్యవసరమని పేర్కొన్నారు. కార్మికుల జీతాలు సమయానికి చెల్లించడం, కనీస వేతనాలు అమలు చేయడం, ఇన్సూరెన్స్ సదుపాయాలు అందుబాటులో ఉంచడం ద్వారా ప్రమాదాల సమయంలో వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కార్మిక చట్టాలను పూర్తిగా అమలు చేసి, ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే పరిశ్రమలు, లేబర్ క్యాంపుల్లో సీసీ కెమెరాలు, యాక్సెస్ కంట్రోల్ వంటి భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, కార్మికులకు సేఫ్టీ ట్రైనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అదనంగా, లేబర్ క్యాంపుల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయడం, ప్రతి కార్మికుడి పూర్తి వివరాలను నమోదు చేసి భద్రపరచడం అవసరమని పేర్కొన్నారు. కార్మికులు పనికి వెళ్లే సమయంలో వారి పిల్లల కోసం స్టడీ సౌకర్యాలు కల్పించి, అవసరమైన మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. లేబర్ క్యాంపుల్లో ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు బాధ్యతాయుతంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఎఫ్ ప్రాంతీయ కమిషనర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం ఈపీఎఫ్ అండ్ ఎంపీ చట్టం అమలు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ చట్టం నిర్దిష్ట సంఖ్యకు పైగా ఉద్యోగులు ఉన్న సంస్థలకు వర్తిస్తుందని, ఒకసారి అమల్లోకి వచ్చిన తరువాత ఉద్యోగుల సంఖ్య తగ్గినా కూడా కొనసాగుతుందని వివరించారు. నిర్దిష్ట వేతన పరిమితి వరకు ఉన్న ఉద్యోగులకు పీఎఫ్ సభ్యత్వం తప్పనిసరి అని, ఉద్యోగి అంటే సంస్థలో వేతనం కోసం పనిచేసే ప్రతి వ్యక్తి అని పేర్కొన్నారు.

ఈ చట్టం కింద ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఇన్సూరెన్స్ పథకాల ద్వారా ఉద్యోగులకు భవిష్యత్‌లో ఆర్థిక భద్రత కల్పించబడుతుందని చెప్పారు. అలాగే ప్రత్యేక పథకాల ద్వారా గతంలో నమోదు కాని ఉద్యోగులను స్వచ్ఛందంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రోత్సాహకాలు అందించే పథకాలు కూడా అమల్లో ఉన్నాయని, వాటి ద్వారా ఉద్యోగులకు ఆర్థిక సహాయం లభిస్తుందని పేర్కొన్నారు. సంస్థలు ఉద్యోగుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, సమయానికి చెల్లింపులు చేయడంతో పాటు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. లేబర్ డిపార్ట్మెంట్ జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ... పనిచేసే ప్రదేశాల్లో కార్మికుల హక్కులు, వారి ప్రయోజనాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల పూర్తి వివరాలు సేకరించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్మికులకు కనీస వేతనాలు తప్పనిసరిగా చెల్లించడంతో పాటు, అదనపు పని చేస్తే ఓవర్‌టైం వేతనం ఇవ్వాలని చెప్పారు. ప్రతి కార్మికుడి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేసి, ప్రమాదాలు జరిగినప్పుడు వారికి సహాయం అందేలా చూడాలని తెలిపారు. అలాగే అన్ని కార్మికుల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, రెగ్యులర్, తాత్కాలిక కార్మికుల వివరాలు కూడా తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. ఈ నియమాలు పాటించని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు వెంటనే సహాయం అందేలా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. సిఎంసి డిప్యూటీ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ నిబంధనలు పాటించని నిర్మాణ సైట్లపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కఠిన చర్యలు కూడా తీసుకుంటామని తెలిపారు. కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం తప్పనిసరని సూచించారు.

పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడాలని, లేకపోతే కార్మికులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్, శేర్లింగంపల్లి డీసీపీ సిహెచ్ శ్రీనివాస్, శేర్లింగంపల్లి అడిషనల్ డీసీపీ ఎం. ఉదయ్ రెడ్డి, ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ దుర్గాప్రసాద్, పీఎఫ్ కమిషనర్ మనోజ్ కుమార్, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ శ్యామ్ సుందర్ రెడ్డి, సిఎంసి డిప్యూటీ కమిషనర్లు కృష్ణమోహన్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com